క్లుప్తంగా

కోరం లేక సమావేశం వాయిదా

కడెం: కోరం లేక బుధవారం నిర్వహించాల్సిన కడెం మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీడీవో అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. తదుపరి సమావేశం నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

ముగిసిన సప్తాహం

భైంసారూరల్: మండలంలోని ఇలేగాం గ్రామంలో బుధవారం సప్తాహం ముగిసింది. వారంరోజుల పాటు భజనలు, కీర్తనలు నిర్వహించి చివరిరోజు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. చివరిరోజు కాగడ హారతి కార్యక్రమంలో పెద్దసంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థి చేయూత



ఆటవస్తువులు, కుర్చీలతో సాయికృష్ణ

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలకు పూర్వవిద్యార్థి, నర్సాపూర్(జి)కే చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సాయికృష్ణ బుధవారం రూ.30 వేల విలువైన ఆటపరికరాలు, కుర్చీలను అందజేశారు. అనంతరం సాయికృష్ణను పాఠశాల కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. కమిటీ కార్యదర్శి బర్కుంట నరేందర్, ధనంజయ, గంగారాం, ఉపాధ్యక్షుడు దత్తురాం, మిట్టపల్లి రాజేందర్, బర్కుంట లక్ష్మణ్, మధు, అశోక్, సుధాకర్, రాజు, ప్రవీణ్ పాల్గొన్నారు.

'ఎంపీ వ్యాఖ్యలు అర్థరహితం'

ఖానాపూర్: భారత రాజ్యాంగాన్ని మార్చేస్తామని బీజేపీ ఎంపీ అనంతహెగ్డే చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్ అన్నారు. బుధవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంపీ వ్యాఖ్యలను తాము ఖండిస్తున్నామని పేర్కొన్నారు. రాజ్యాంగం, లౌకికవాదంపై అవగాహన లేకుండా మాట్లాడిన కర్నాటక ఎంపీపై చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

పెద్దమ్మ ఆలయంలో పూజలు



ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

సోన్: మండలంలోని కద్దాల్ పెద్దమ్మతల్లి ఆలయంలో బుధవారం బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి వి.సత్యనారాయణగౌడ్ గ్రామస్తులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ సర్పంచ్ లక్ష్మీ రాజనర్స య్య, చింతలపల్లి సాయారెడ్డి, భీమన్న, రమణ, శ్రీకాంత్, రాము పాల్గొన్నారు.

రెన్యూవల్ చేసుకోవాలి

ఖానాపూర్: పట్టణంలోని పలు దుకాణాల వ్యాపారులు ఈనెల 31లోగా ట్రేడ్ లైసెన్స్‌ను రెన్యూవల్ చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మనోహర్ తెలిపారు. ఏప్రిల్ నుంచి 25 శాతం అదనపు రుసుం విధించనున్నట్లు పేర్కొన్నారు.

అనారోగ్యంతో కారోబార్ మృతి



గంగాధర్(ఫైల్)

కుంటాల: మండలంలోని దౌనెల్లి పంచాయతీ కారోబార్ మైసగంగాధర్(60) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈయన 25 ఏళ్లుగా కారోబార్‌గా విధులు నిర్వర్తిస్తున్నా డు. మృతుడికి కుమారుడు ఉన్నారు. ఎంపీవో అబ్దుల్ రహీం, కారోబార్ల సంఘం జిల్లా కన్వీనర్ శంకర్ సంతాపం ప్రకటించారు.

న్యాయం చేయాలని ఫిర్యాదు

కడెం: బిల్లు మంజూరు చేయిస్తానని చెప్పి డబ్బులు తీసుకున్న ఉపాధిహామీ మేట్ మల్లేశ్‌పై చర్యలు తీసుకోవాలని మండలంలోని చిన్నబెల్లాల్ గ్రామానికి చెందిన సాకు లక్ష్మీ బుధవారం ఎంపీడీవో అరుణకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళితే.. ఉపాధిహామీ పథకం కింద నిర్మించుకున్న పశువుల పాక బిల్లుల కోసం గ్రామంలోని మేట్ మల్లేశ్‌ను సంప్రదించామని లక్ష్మి తెలిపింది. పది వేలు ఇస్తే బిల్లు మంజూరు చేయిస్తాననడంతో అతడికి ఫోన్‌పే ద్వారా రూ.10వేలు పంపినట్లు బాధితురాలు ఆరోపించింది. విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని వేడుకుంది.

డీఎస్పీ విచారణ

నిర్మల్: ఇటీవల సారంగపూర్ ఎంపీపీ ఎన్నిక సమయంలో జరిగిన గొడవలపై బుధవారం నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాస్ విచారణ చేపట్టారు. గతనెల 28న ఎంపీపీ ఎన్నిక సమయంలో ఎంపీపీగా ఎన్నికైన ఆడె సవితాబాయి మరిదిపై బీజేపీ మండల అధ్యక్షుడు విలాస్ దాడి చేయడంపై ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు మండల కేంద్రంలో విచారణ చేపట్టారు. వారి వెంట స్థానిక ఎస్సై చంద్రమోహన్ ఉన్నారు.

'డబుల్' కాలనీలో సౌకర్యాలేవి..?

- తాగునీటికి కటకట, వీధిదీపాలు కరువు
- అరకొరగా సెప్టిక్‌ట్యాంక్‌ల నిర్మాణం
- ఇబ్బంది పడుతున్న కాలనీవాసులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



వీధి దీపాల్లేక చీకట్లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కాలనీ



ఇటీవల మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

ఖానాపూర్: పేదలకు సొంతింటి కల నెరవేర్చాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలో 400 డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించి నిరుపేదలకు అందించింది. కానీ ఈ డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించిన కాలనీలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. వేసవి ప్రారంభంలోనే తాగునీటి కటకట ప్రారంభమైంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణలోపం కారణంగా ఇళ్ల నిర్మాణంలో నాణ్యత కరువైంది.. ఇష్టానుసారం పనులు చేపట్టారు. వర్షాకాలంలో గదులు ఉరుస్తుండటంతోపాటు డబుల్ బెడ్‌రూం అపార్ట్‌మెంట్లలో నాసిరకం పైపుల కారణంగా లీకేజీలు ఏర్పడుతున్నాయి. ఇళ్ల కిటికీలు, డోర్‌లు ఊడిపోవడంతోపాటు భవనాలకు అనేక చోట్ల పగుళ్లు తేలాయి. 400 కుటుంబాలు నివసించే ఈ కాలనీలో సెప్టిక్ ట్యాంకులు సైతం అరకొరగా నిర్మించడంతో కాలనీలో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు.

వీధిదీపాలేవి..

వీటికి తోడు కాలనీలోకి వెళ్లేందుకు రోడ్లు సక్రమంగా లేవు. స్ట్రీట్ లైట్లు(వీధిదీపాలు) లేక రాత్రంతా చీకట్ల మధ్యే ప్రజలు కాలం వెళ్లదీస్తున్నారు. ఇదే అదనుగా భావిస్తున్న దొంగలు రెచ్చిపోతున్నారు. కాలనీలోకి చొరబడి వాహనాలను దగ్ధం చేస్తున్నారు. చుట్టూ అటవీ ప్రాంతం ఉండడంతో ప్రజలు సైతం భయాందోళన చెందుతున్నారు.

నీటి కోసం ధర్నా..

డబుల్ బెడ్‌రూం కాలనీలోని పలు బ్లాకుల్లో తాగునీరు రాకపోవడంతో కాలనీకి చెందిన నిరుపేదలు ఇటీవల స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. సొంత డబ్బులు పోగు చేసుకుని బోరు వేయించుకున్నప్పటికీ నీరు పడలేదని పలువురు కాలనీవాసులు వాపోయారు. మున్సిపల్ చైర్మన్ ప్రత్యేక చొరవ తీసుకుని ట్యాంకర్ ద్వారా తాగునీటిని అందిస్తున్నారు. నీటి సమస్యపై తమకు శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



పేరుకే డబుల్ బెడ్‌రూం కాలనీ.. ఇక్కడ కనీస సౌకర్యాలు లేవు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. భవన నిర్మాణ పనుల్లో లోపించిన నాణ్యతపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

– నంది రామయ్య, డబుల్ బెడ్‌రూం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు

భయంగా ఉంటుంది



కాలనీలో స్ట్రీట్‌లైట్లు ఏర్పాటు చేయలేదు. చుట్టూ అటవీప్రాంతం ఉండడంతో భయంగా గడపాల్సి వస్తోంది. కాలనీలో దొంగల బెడద ఉంది. అత్యవసరమై పోలీసులు, ఇతర అధికారులకు ఫోన్ చేయాలన్నా సెల్‌ఫోన్ సిగ్నల్ రావడం లేదు. వెంటనే సమస్యలను పరిష్కరించాలి.

– సత్తవ్వ, కాలనీవాసి

సెప్టిక్ ట్యాంకులతో దుర్గంధం



కాలనీలో జనాభాకు సరిపడా సెప్టిక్ ట్యాంకులను నిర్మించలేదు. భవనాల పైపులు నాసిరకంగా ఉండడంతో లీకేజీలు ఏర్పడి దుర్గంధం వస్తోంది. కాలనీలో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలి. ఇష్టారాజ్యంగా పనులు చేసిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

– బానావత్ గోవింద్, కాలనీ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



సోన్: పాక్‌పట్లలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

సోన్: మండలంలోని పాక్‌పట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా హాజరైన కంబైన్డ్ ఆటోమోటివ్స్ సీఈఓ నార్లపురం రవీందర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అనంతరం పదో వతరగతి విద్యార్థులు పాఠశాలకు పోడియం అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకన్న, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ముధోల్: మండలంలోని మచ్కల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వార్షిక పరీక్షలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ప్రధానోపాధ్యాయుడు ఎస్.పద్మాకర్ అన్నారు. మండల కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలోనూ పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు.



లోకేశ్వరం: పుస్పూర్‌లో పాడుతున్న విద్యార్థి



మస్కాపూర్‌లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల నృత్యాలు, నాటికలు, మిమిక్రీలు ఆకట్టుకున్నాయి. పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయుడు చంద్రప్రకాశ్‌గౌడ్, ఉపాధ్యాయులు నారాయణ్, ముత్తన్న, రాజేశ్వర్, రాజశేఖర్, రఘునాథ్, అశోక్ ఉన్నారు.

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్, పాత ఎల్లాపూర్ జెడ్పీఎస్ఎస్‌లలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడారు. ఉన్నత రంగాల్లో స్థిరపడేందుకు పదో తరగతి పునాది వంటిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హెచ్ఎంలు నరేందర్‌రెడ్డి, రమాదేవి, కిషన్, తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ జాబ్‌కార్డులు అందిస్తాం



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఏపీఓ శివలింగం

భైంసారూరల్: అర్హులైన కూలీలందరికీ జాబ్‌కార్డులు అందిస్తామని ఈజీఎస్ ఏపీవో శివలింగం అన్నారు. మండలంలోని ఇలేగాం గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించి మాట్లాడారు. పనులు పూర్తయిన వెంటనే ఎంబీ రికార్డులు రాయించి డబ్బులు అందేలా చూస్తామన్నారు. సిద్దూర్ వెళ్లి నర్సరీ పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.

డంపింగ్‌యార్డు పరిశీలన

ఖానాపూర్: పట్టణ శివారులో ఉన్న డంపింగ్ యార్డును బుధవారం చైర్మన్ సత్యం కమిషనర్ మనోహర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఇంద్రానగర్ కాలనీకి చెందిన మేకల రవీందర్‌కు సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరవగా.. చైర్మన్ సత్యం వారికి అందజేశారు. పట్టణంలోని అయ్యప్ప ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చైర్మన్ చిన్నంసత్యం, వైస్ చైర్మన్ సంతోష్‌ను సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో పరిమి సురేశ్, దయానంద్, నిమ్మల రమేశ్, షబ్బీర్‌పాషా, సలీంఖాన్, కొత్తపెల్లి సురేశ్, రాజన్న తదితరులు ఉన్నారు.

అడవుల రక్షణపై అవగాహన

కుభీర్: మండలంలోని కిషన్‌నాయక్‌తండాలో బుధవారం అడవుల రక్షణపై అటవీ అధికారులు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా అటవీ సెక్షన్ ఆఫీసర్ జాదవ్ కోటేశ్ మాట్లాడారు. వేసవి నేపథ్యంలో అడవిలోకి వెళ్లే వారు అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వారి వెంట సర్పంచ్ గణపతి, పలువురు గిరిజనులు ఉన్నారు

సకాలంలో పన్నులు వసూలు చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో రహీం

కుంటాల: సకాలంలో ఇంటి, నీటి పన్నులు వసూలు చేయాలని ఎంపీడీవో అబ్దుల్ రహీం పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కల్లూర్ పంచా యతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించా రు. అనంతరం అంబకంటితండాలో నర్సరీ పరిశీలించి మొక్కలు ఎండిపోకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శులు భోజన్న, సతీశ్ ఉన్నారు.

అనుమతుల్లేకుండా ఇసుక తరలించొద్దు

- లోకేశ్వరం ఎస్సై రాజు

లోకేశ్వరం: అనుమతుల్లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని లోకేశ్వరం ఎస్సై రాజు అన్నారు. బుధవారం మండలంలోని హవర్గా శివారులోని సుద్దవాగు ప్రాంతంలో ఎస్సై సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడులు చేశారు. అనుమతి లేకుండా లోకేశ్వరం వైపు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కమల్‌కోట్‌లో..

మామడ: మండలంలోని కమల్‌కోట్ గోదావరి నది నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను న్యూటెంబుర్ని సమీపంలో బుధవారం పోలీసులు పట్టుకున్నారు. అనంతరం టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి వాహన యాజమానిపై కేసు నమోదు చేశారు.

'కార్మికులను ఇబ్బందులకు గురి చేయొద్దు'

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురి చేయొద్దని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ ఆరోపించారు. బుధవారం పాఠశాలలో మాట్లాడారు. పాఠశాలలో నిర్వహించే వీడ్కోలు వేడుకలకు సొంత ఖర్చులతో కోడిగుడ్లు, జిలేబి, మిర్చీలు వండి పెట్టాలని కోరితే కార్మికులు నిరాకరించారన్నారు. అప్పటినుంచి ఉపాధ్యాయులు కార్మికులపై కక్ష సాధింపునకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మధ్యాహ్న భోజనంలో రాళ్లు, వెంట్రుకలు వస్తున్నాయని కార్మికులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని పేర్కొన్నారు. ఎంఈవో, డీఈవో విచారణ జరిపి న్యాయం చేయకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భోజన కార్మికులు లక్ష్మి, మంజుల, పద్మ, నర్సవ్వ, చిన్నమ్మ, రుకుంబాయి, తదితరులు ఉన్నారు.

ఆపత్కాలంలో బాధితులకు అండ

- వట్టోలిలో రేకులషెడ్డు నిర్మాణానికి ముందుకొచ్చిన ప్రజా ట్రస్టు
- తక్షణ సాయం కింద సరుకులు, బియ్యం అందజేత



బాధిత కుటుంబీకులను పరామర్శిస్తున్న ట్రస్టు చైర్మన్ భోస్లే మోహన్‌రావు పటేల్

లోకేశ్వరం: నష్టపోయామని అధైర్యపడొద్దని.. మీకు ఏయే కష్టమొచ్చిన అండగా ఉంటానని మోహన్‌రావు ప్రజా ట్రస్టు చైర్మన్ భోస్లే మోహన్‌రావు పటేల్ అన్నారు. మంగళవారం మండలంలోని వట్టోలిలో ఎగ్గం పెద్ద భూమన్న, సాయన్నల ఇళ్లు షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోవడంతో రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. బుధవారం వట్టోలి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాలను మోహన్‌రావు పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. తక్షణ సాయం కింద వారికి నెలరోజులకు సరిపడ నిత్యావసర సరుకులు, క్వింటాల్ బియ్యం, కొంత నగదు అందజేశారు. ప్రజా ట్రస్టు ఆధ్వర్యంలో రేకులషెడ్డు నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ముధోల్ మాజీ ఎంపీపీ సుభాశ్ పటేల్, బీజేపీ నాయకులు సాయినాథ్ పటేల్ తదితరులు ఉన్నారు.

మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నేతలు

నిర్మల్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం మునూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని విశ్రాంతి ఉద్యోగుల సంఘం భవనంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. మున్నూరుకాపు నాయకులు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా సంఘ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు ఎంసీ లింగన్న, నిర్మల్ మున్నూరు కాపు మిత్రమండలి అధ్యక్షుడు పుప్పల రమేశ్, యువజన మిత్రమండలి అధ్యక్షుడు గంట రాకేశ్, కౌన్సిలర్లు పూదరి రాజేశ్వర్, రాజు, శ్రీధర్, పద్మాకర్, నాయకులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే



న్యూబొప్పారంలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

సోన్: మండలంలోని న్యూబొప్పారం, న్యూవెల్మల్ గ్రామాల్లో బుధవారం పీహెచ్‌సీ వైద్యాధికారి సమత ఆధ్వర్యంలో కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ శరీరంపై స్పర్శ లేని మచ్చలుంటే సమీపంలోని వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఎండీటీ చికిత్సతో కుష్ఠు వ్యాధిని నయం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల, రాజేశుడు, పలువురు ఆశవర్కర్లు సుమలత, పద్మ, లావణ్య, కళావతి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: వ్యాధిగ్రస్తులు చికిత్స తీసుకుంటేనే కుష్ఠు(లెప్రసీ) నిర్మూలన సాధ్యమని వైద్యురాలు ప్రత్యూష పేర్కొన్నారు. లక్ష్మణచాంద పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో 14 రోజులు 18 బృందాలతో లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెనింగ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సిబ్బంది వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త శివకృష్ణ గౌడ్ ఉన్నారు.

'వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి'

ఖానాపూర్: ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని తెలంగాణ వడ్డెర సంక్షేమ సంఘం సోషల్ మీడియా స్టేట్ కన్వీనర్ బోసు రాము అన్నారు. బుధవారం ఖానాపూర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర మంత్రి మండలి ఆమోదించిన 16 కార్పొరేషన్లలో వడ్డెర కార్పొరేషన్ లేకపోవడం బాధాకరమన్నారు. బీఆర్ఎస్ తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డెర కులస్తుల అభివృద్ధిని విస్మరిస్తోందన్నారు. వడ్డెర కులస్తుల సమస్యలు పరిష్కరించకుంటే తమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

'పీఆర్ అధికారులపై చర్యలు తీసుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఖానాపూర్: పంచాయతీరాజ్ అధికారుల పర్యవేక్షణ లేకనే మండలంలోని గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద సీసీరోడ్లు, డ్రెయినేజీల నిర్మాణ పనులు ఇష్టారాజ్యంగా చేపడుతున్నారని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేశ్ పేర్కొన్నారు. దీనికి బాధ్యులైన పంచాయతీ అధికారులపై కలెక్టర్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఖానాపూర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మార్చి నెలాఖరు వరకే గడువు ఉందని చెబుతూ పనుల్లో నిబంధనలు పాటించడం లేదన్నారు. సీసీరోడ్లు, డ్రెయినేజీ పనులకు కనీసం క్యూరింగ్ చేయడం లేదని ఆరోపించారు. సమావేశంలో నాయకుడు దుర్గం లింగన్న పాల్గొన్నారు.

ప్రోత్సాహక బహుమతులు అందజేత



విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం

మామడ: మండలంలోని పొన్కల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మెరుగైన హాజరు కలిగిన విద్యార్థులకు బుధవారం ప్రధానోపాధ్యాయుడు అరవింద్ కుమార్ ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ విద్యాసంవత్సరం 185 పని దినాలకు గాను పూర్తిస్థాయిలో పాఠశాలకు హాజరైన మదులిక (ఏడో తరగతి)కు రూ.500, 184 రోజులు హాజరైన సాహితి(ఏడో తరగతి)కి రూ.300 అందించి విద్యార్థులను అభినందించారు.

'అట్రాసిటీ కేసు నమోదు చేయాలి'



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: విచారణ జరిపి బీఆర్ఎస్ కడెం మండలాధ్యక్షుడు జొన్నల చంద్రశేఖర్‌పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరుతూ బుధవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో డీఆర్వో గంగయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందరర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దుర్గం నూతన్‌కుమార్, డి.తిరుపతి మాట్లాడారు. జొన్నల చంద్రశేఖర్ ఎస్సీ, ఎస్టీల పేరిట నాలుగు పొక్లెయినర్లు, జేసీబీ, మూడు టిప్పర్లు, అజాక్స్ కాంక్రీట్ మిక్సర్ వాహనాలు తీసుకున్నారన్నారు. దీనికి తమ సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు. అధికారులు విచారణ జరిపి సదరు వాహనాలను తిరిగి లబ్ధిదారులకు ఇప్పించాలని కోరారు.